భూమాత కోసం ఎంపీకి బృందం

- భూ రికార్డుల డిజిటల్ పోర్టల్‌పై అధ్యయనానికి అధికారులు
- ధరణి స్థానంలో కొత్త పోర్టల్ యోచనలో ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): తాము అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని, భూ మాత పోర్టల్‌ను ప్రవేశపెడతామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నూతన పోర్టల్ ఏర్పాటుపై దృష్టిసారించారు. ఇప్పటికే రెవెన్యూ శాఖపై, ధరణి పోర్టల్‌పై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి మార్గదర్శకాలు రూపొందించేందుకు ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇప్పుడు భూ మాత పోర్టల్‌పై దృష్టిసారించారు. ధరణిని పూర్తిగా ఎత్తివేసి కొత్త పోర్టల్ ప్రవేశపెట్టాలా? లేదా ఉన్న పోర్టల్‌లోనే కావాల్సిన మార్పులు, చేర్పులు చేయాలా? అనే అంశంపై కొన్ని రోజులుగా తీవ్ర చర్చలు సాగుతున్నాయి. ఉన్న పోర్టల్‌లోనే మార్పులు చేయాలని అధికారులు సూచించగా, హామీ ఇచ్చిన మేరకు కొత్త పోర్టల్ తేవాల్సి ఉంటుందని అధికార పక్ష నేతలు స్పష్టం చేస్తున్నారట. ఈ నేపథ్యంలో ముందుగా ఇతర రాష్ట్రాల్లో భూ రికార్డుల నిర్వహణపై అధ్యయనం చేసి, ఆ తర్వాతే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించినట్టు తెలిసింది. దీంతో రెవెన్యూ అధికారుల ప్రత్యేక బృందాన్ని మధ్యప్రదేశ్‌కు పంపించినట్టు సమాచారం. 'భూ లేఖ్' పేరుతో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ వ్యవస్థను నిర్వహిస్తున్నది. ఈ పోర్టల్ ఆధారంగా లావాదేవీలు జరుగుతున్న విధానం, భూ సర్వే ఎలా నిర్వహిస్తున్నారు? వంటి వివరాలపై అధ్యయనం చేసి నివేదిక అందించనున్నారు. ధరణి తరహాలోనే భూ లేఖ్‌లోనూ రాష్ట్రంలోని వ్యవసాయ భూములతోపాటు వ్యవసాయేతర భూముల వివరాలు కూడా అందుబాటులో ఉన్నాయి. బ్యాంకు లోన్లు, వ్యవసాయ ప్రణాళికలు వంటివాటికి ఈ రికార్డే ఆధారంగా ఉన్నది. వాస్తవానికి ధరణితో పోల్చితే పెద్దగా తేడాలు లేవు. ఈ క్రమంలో అధికారులు ఎలాంటి నివేదిక సమర్పిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

ఉచిత ప్రయాణానికి మహాలక్ష్మి కార్డు

- గుర్తింపుకార్డు సమస్యకు చెక్
- టీఎస్‌ఆర్టీసీ అధికారుల కసరత్తు
- పేరుపై అధికారుల తర్జనభర్జన

- వేములవాడలో అదనపు బస్సుల కోసం ఆందోళన

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు.. సరిపడా బస్సులు నడపడం లేదని ఆర్టీసీ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండ్ ఎదుట అందోళనకు దిగారు. రెండు గంటలకు పైగా వేచిచూసినా బస్సులు రాలేదు. వచ్చిన బస్సుల్లో రద్దీ అధికంగా ఉండటంతో ఆగ్రహానికి గురై ఆర్టీసీ అధికారులను నిలదీశారు. బస్సులో సీట్ల కోసం వరంగల్‌కు చెందిన రెండు కుటుంబాల మధ్య గొడవ తలెత్తి పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. ఇప్పటికైనా వేములవాడకు సరిపడా బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. –వేములవాడ రూరల్

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించిన గుర్తింపుకార్డుల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. క్షేత్రస్థాయిలో కండక్టర్లు ఎదుర్కొంటున్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేలా 'మహాలక్ష్మి కార్డు' తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిసింది. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను ఆర్టీసీ అధికారులు రూపొందిస్తున్నారు. జీరో టికెట్ విషయంలో కొందరు కండక్టర్ల అత్యుత్సాహంపై ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. ఉచిత ప్రయాణానికి ఆధార్ ఒరిజినల్ కార్డును చూపించాలన్న నిబంధనపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడన్నీ డిజిటలైజ్ కాబట్టి ఫోన్లలోని కార్డులను చూపించినా అనుమతించాలని ప్రయాణికులు గొడవకు దిగుతున్నారు. కొందరు జిరాక్స్ కాపీలను తీసుకెళ్తున్నా కండక్టర్లు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ఇలాంటి వాటికి చెక్‌పెట్టేలా శాశ్వతంగా ఓ కార్డును తీసుకురావాలని ఆర్టీసీ యోచిస్తున్నది. కార్డు ఎలా ఉండాలి? ఏం పేరు పెట్టాలి? అన్న దానిపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

పురుషుల సీట్ల సంగతేంటి?

మహిళలకు ప్రయాణం ఉచితం కావడంతో బస్సుల్లో పురుషులకు సీట్లు లభించడం లేదన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పురుషులకు బస్సుల్లో 20 శాతం సీట్లు కేటాయిస్తే ఎలా ఉంటుందన్న దానిపైనా అధికారులు చర్చిస్తున్నారు. గతంలో కర్ణాటకలోనూ ఇలాంటి పరిస్థితే ఎదురైంది. పురుషుల కోసం వారం రోజులపాటు ప్రత్యేకంగా బస్సులు నడిపినా వాటికి అంతగా అదరణ లభించలేదు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ వైపే మొగ్గుచూపుతున్నట్టు తెలిసింది. త్వరలోనే ఆర్టీసీకి కొత్తబస్సులతో పాటు అద్దె బస్సులు కూడా అందుబాటులోకి వస్తాయని, అవి రాగానే సమస్య పరిష్కారం అవుతుందని చెబుతున్నారు.

జీరో టికెట్లపై ఆరోపణలు

ఎక్కువమంది ప్రయాణికులను తీసుకెళ్తే డ్రైవర్, కండక్టర్‌కు యాజమాన్యం నజరానాలు ప్రకటించడంతో కొందరు కండక్టర్లు జీరో టికెట్లను ఎక్కువకొట్టి లెక్క పెంచుతున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. హైదరాబాద్ జంట నగరాల్లో 2,850 బస్సులు ఉన్నాయి. సీట్లలో 60శాతం మహిళలతో నిండిపోతున్నాయి.

తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జిగా అమిత్ షా

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జిగా అమిత్ షా వ్యవహరించనున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలిపారు. అమిత్ షా గురువారం హైదరాబాద్ చేరుకుని మధ్యాహ్నం 12 గంటలకు భాగ్యలక్ష్మి గుడిలో ప్రత్యేక పూజలు చేస్తారని వెల్లడించారు. అనంతరం కొంగరకలాన్‌లో నిర్వహించనున్న పార్టీ రాష్ట్ర స్థాయి సమావేశానికి హాజరవుతారని పేర్కొన్నారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నిమిత్తం 90 రోజుల యాక్షన్ ప్లాన్‌ను రూపొందించనున్నట్టు వెల్లడించారు. ఫిబ్రవరి చివరలో పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్, మార్చిలో ఎన్నికలు ఉంటాయని చెప్పారు. జనవరి 22న అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ఠ చేస్తున్నామని, హిందువులంతా ఏదో ఒక రూపంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంట్లో 5 దీపాలు వెలిగించి ప్రకాశవంతం చేసుకోవాలని కోరారు.

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న రైతు సంఘాల నేతలు

దక్షిణాది పసుపు రైతులపై కేంద్రం వివక్ష

- రౌండ్‌టేబుల్ సమావేశంలో రైతు సంఘాల నేతలు

ఖైరతాబాద్, డిసెంబర్ 26: దక్షిణ భారత పసుపు రైతులపై కేంద్రం చిన్నచూపు చూస్తున్నదని రైతు సంఘాల నేతలు విమర్శించారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వివిధ రాష్ట్రాల రైతు నేతలు పాల్గొని ప్రసంగించారు. దేశ వ్యాప్తంగా పండించే పసుపులో 20 శాతానికి పైగా తెలంగాణలో పండిస్తున్నారని, 10 లక్షల క్వింటాళ్ల ట్రేడింగ్ జరుగుతున్నదని తెలంగాణ పసుపు రైతుల సంఘం అధ్యక్షుడు కోటపాటి నరసింహంనాయుడు తెలిపారు. రాష్ట్రానికి జాతీయ పసుపు బోర్డు ప్రకటించినా నేటివరకు విధివిధానాలు రూపొందించలేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా రైతాంగ సమస్యలపై కేంద్రం తన వైఖరిని స్పష్టం చేయకుంటే వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీలో నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రీయ కిసాన్ మహాసంఘ్ నాయకులు శివకుమార్ మాట్లాడుతూ కనీస మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని వెంటనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. కర్ణాటక రాజ్య రైతు సంఘం నేత కే శాంతకుమార్ మాట్లాడుతూ దేశానికి వెన్నెముక లాంటి వారని మరిచిపోవద్దని స్పష్టం చేశారు. పంజాబ్ బీకేయూ అధ్యక్షుడు జగజీత్‌సింగ్ మాట్లాడుతూ దేశమంతా రైతు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేయాలని బీకేయూ హిమాచల్‌ప్రదేశ్ నేత లక్‌వేందర్‌సింగ్ డిమాండ్ చేశారు. వ్యవసాయరంగ పాలసీపై ప్రపంచ వాణిజ్య సంస్థతో కేంద్రం చేసుకున్న ఒప్పందాలను విరమించుకోవాలని కేరళ రైతు సంఘం నేత కేబీ బిజ్జు కోరారు.

యాదాద్రి స్ఫూర్తి అజరామర కీర్తి

మొదటిపేజీ తరువాయి...

టింబర్ డిపోను సందర్శించి నిరుడు మే నెలలో ఆలయ ద్వారాలు, తలుపులకు సంబంధించిన బృహత్తర ప్రాజెక్టును అప్పగించారు. జనవరి 22న అయోధ్యలో రామయ్య ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరగనున్న వేళ నగరం నుంచి ఆలయ ద్వారాలు వెళ్లనుండడంపై ఆధ్యాత్మికవేత్తలు, భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం యాద్రాద్రి అనే ఓ మహాద్భుతాన్ని ఆవిష్కరించకపోయి ఉంటే అయోధ్య రామయ్య ఆలయానికి తలుపులు అందించే మహద్భాగ్యాన్ని నగరం కోల్పోయి ఉండేదని అనురాధ డింబర్ డిపో అధినేత చదలవాడ శరత్‌బాబు తెలిపారు. అప్పట్లో యాదాద్రిని సందర్శించిన తమిళనాడు బృందం సభ్యులు ఆలయ కళాకృతులను చూసి మంత్రముగ్ధులైనట్టు యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కిషన్‌రావు తెలిపారు. యాదాద్రి నారసింహుడే అయోధ్య రాముడికి తలుపులు రూపొందించే మార్గం చూపాడని అనురాధ టింబర్ డిపో నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌లోని అనురాధ టింబర్ డిపోలో రూపుదిద్దుకొంటున్న రామాలయ తలుపులు

కేసీఆర్ దూరదృష్టితో

దేశవ్యాప్తంగా కొత్తగా నిర్మించే ఆలయాలకు యాదాద్రి ఏదో రకంగా ఆదర్శంగా నిలుస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వం యాదాద్రిని ప్రపంచస్థాయి క్షేత్రంగా, నేత్రపర్వంగా తీర్చిదిద్దింది. ఆలయ పునర్నిర్మాణం కోసం అప్పటి సీఎం కేసీఆర్ దేశంలోని అనేక శిల్పకళారీతులను స్వయంగా పరిశీలించి అధ్యయనం చేశారు. చివరికి వివిధ శిల్పకళా వైభవం భక్తులకు ఒకే చోట కనువిందు చేసేలా రూపొందించి దేశాన్ని అబ్బురపరిచారు. కేసీఆర్ నాడు చేసిన ఓ గొప్ప ఆలోచన నేడు దేశానికి ఆదర్శంగా నిలుస్తుండడంపై ప్రశంసలు కురుస్తున్నాయి.

స్టార్ట్ ఎక్స్ ప్యానెల్ డిస్కషన్‌లో యూట్యూబ్ ఇండియా ఎండీ చటర్జీ, సినీ ప్రముఖులు రానాతో పాటు పలువురు

ఏఐతో రెండేండ్లలో సమూల మార్పులు

- యూట్యూబ్ ఇండియా ఎండీ ఇషాన్ చటర్జీ
- హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్‌లో స్టార్ట్ ఎక్స్ సమిట్
- నటుడు రానా, డైరెక్టర్ నాగ్‌అశ్విన్ సహా ప్రముఖుల హాజరు

సిటీబ్యూరో, డిసెంబర్ 26(నమస్తే తెలంగాణ): ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) టెక్నాలజీతో డిజిటల్ కంటెంట్‌లో సమూల మార్పులు, వినూత్న ధోరణులు అందుబాటులోకి రానున్నాయని యూట్యూబ్ ఇండియా ఎండీ ఇషాన్ చటర్జీ అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్టార్ట్ ఎక్స్ సమిట్ జరిగింది. పూర్వ విద్యార్థులైన సినీ ప్రముఖులు రానా దగ్గుబాటి, డైరెక్టర్ నాగ్ అశ్విన్, మెటా మాజీ ప్రొడక్ట్ మేనేజర్ సతీశ్ ముమ్మారెడ్డితోపాటు పలువురు ఆంత్రప్రెన్యూర్లు కూడా పాల్గొన్నారు. ఇషాన్ చటర్జీ మాట్లాడుతూ జనరేటివ్ ఏఐతో వచ్చే 24 నెలల్లో యూట్యూబ్‌తోపాటు వీడియో ప్లాట్‌ఫామ్ తీరుతెన్నులు మారిపోనున్నాయని చెప్పారు. హెచ్‌పీఎస్ పూర్వ విద్యార్థి, ప్రముఖ క్రికెట్ కామెంటేటర్ హర్షా భోగ్లే ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక చర్చాగోష్ఠి నిర్వహించారు. వివిధ వ్యాపార, వాణిజ్య రంగాల్లో రాణిస్తున్న పూర్వ విద్యార్థులు స్టార్టప్ కంపెనీలకు రూ.4.9 కోట్ల పెట్టుబడిని అందించారు. కార్యక్రమంలో టమాడా మీడియా కో ఫౌండర్ రాహుల్ టమాడా, మోటోవాల్ట్ ఎండీ వికాస్ ఝాబాఖ్, సాయి లైఫ్ సైన్సెస్ సీఈవో కృష్ణ కనుమూరి తదితరులు పాల్గొన్నారు

'వ్యూహం' విడుదలపై స్టేకు హైకోర్టు నిరాకరణ

- రాంగోపాల్ వర్మకు స్వల్ప ఊరట

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): దర్శకుడు రాంగోపాల్ వర్మకు న్యాయస్థానంలో స్వల్ప ఊరట లభించింది. ఆయన రూపొందించిన 'వ్యూహం' చిత్రం విడుదలను నిలిపివేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. ఈ చిత్ర ప్రదర్శనకు సెన్సార్ బోర్డు అనుమతి ఇవ్వడాన్ని సవాలు చేస్తూ టీడీపీ నేత నారా లోకేశ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నంద మంగళవారం విచారణ జరిపారు. టీడీపీ లేవనెత్తిన అభ్యంతరాలపై వివరణ ఇవ్వాలని సెన్సార్ బోర్డును ఆదేశించిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను 28కి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

సముద్రంలో తెలంగాణ యువకుడి గల్లంతు

- విధినిర్వహణలో ఇరాన్ షిప్‌లో వెళ్తుండగా విషాదం

ములుగురూరల్, డిసెంబర్ 26: సముద్రం మధ్యలో ఓడకు జరిగిన ప్రమాదంలో ములుగు జిల్లా తాడ్వాయి మండలం బయ్యక్కపేటకు చెందిన గుర్రం సమ్మిరెడ్డి ఏకైక కుమారుడు శ్రీమాన్(23) గల్లంతయ్యాడు. బీటెక్ పూర్తి చేసిన శ్రీమాన్ నవంబర్ 22న ఇరాన్‌లోని జైపూర్ రుద్రాక్ష కన్‌స్ట్రక్షన్ షిప్‌లో ఉద్యోగం వచ్చిందని వెళ్లాడు. గత శుక్రవారం ఏడుగురితో కలిసి సముద్ర మార్గాన షిప్ ట్రాన్స్‌పోర్టు విధుల్లో ఉన్నాడు. అదే రోజు రాత్రి 8 గంటలకు షిప్ గల్లంతైంది. ఈ విషయాన్ని శ్రీమాన్‌తో పనిచేసే స్నేహితుడు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బంధువులకు మంగళవారం సమాచారం అందించాడు. శ్రీమాన్ తల్లిదండ్రులు సంబంధిత కంపెనీ ఉద్యోగికి కాల్ చేయగా.. ప్రమాదం నిజమేనని, షిప్‌లో వెళ్లిన ఏడుగురిలో రెస్క్యూ టీమ్ ముగ్గురిని కాపాడిందని, ఒకరి మృతదేహం లభ్యమైందని వివరించాడు. శ్రీమాన్‌తోపాటు షిప్ కెప్టెన్ ఆచూకీ తెలియలేదని, వారికోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపాడు. ఈ విషయమై గుర్రం సమ్మిరెడ్డి దంపతులు మంత్రి సీతక్కతోపాటు జడ్పీచైర్‌పర్సన్ బడే నాగజ్యోతిని కలిసి.. తమ కుమారుడి ఆచూకీ తెలుసుకొని తమకు అప్పగించాలని వేడుకున్నారు. అలాగే జిల్లా కలెక్టర్, ఎస్పీకి సైతం ఫిర్యాదు చేసినట్టు వివరించారు. శ్రీమాన్ తల్లి గుర్రం రమ ప్రస్తుతం బయ్యక్కపేట గ్రామ సర్పంచ్‌గా కొనసాగుతున్నారు.

మాకు బతుకు దారి చూపండి!

- మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై పునరాలోచించాలి
- ఆటో కార్మికుల సమస్యలను వారంలోగా పరిష్కరించాలి
- లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం
- టీఏటీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య

శంషాబాద్‌లో మంగళవారం బీఎంఎస్ ఆధ్వర్యంలో ఆటోల ర్యాలీ

హైదరాబాద్ సిటీబ్యూరో/శంషాబాద్ రూరల్, డిసెంబర్ 26: 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ఆటో డ్రైవర్లు, ఇతర కార్మికులు ఉపాధి కోల్పోయారు.. ఈ పథకంపై పునరాలోచించాలి.. వారంలోగా ఆటో కార్మికులకు సరైన న్యాయం చేయాలి' అని బీఆర్‌టీయూ అనుబంధ సంస్థ అయిన టీఏటీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య వేముల రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని ఆటో కార్మికులతో సమావేశమై, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలతో రాష్ట్రంలోని ఆటో కార్మికుల సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకొని నివేదికను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగానే ఇక్కడికి వచ్చినట్టు చెప్పారు. ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయం చూపకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచితంగా ఉచిత బస్సు పథకం అమలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. సమావేశంలో సంఘం మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏర్పుల బాల్‌రాజ్, మాసాయిపేట మండల అధ్యక్షుడు అశోక్, చేగుంట మండల అధ్యక్షుడు యాదగిరితోపాటు అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

శంషాబాద్‌లో ఆటో కార్మికుల భారీ ర్యాలీ

ఆటో కార్మికులకు ఉపాధి చూపకుండా మహిళల ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని తెచ్చిన ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శంషాబాద్ పట్టణంలో బీఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఆటో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నందకిషోర్ మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినా ఎలాంటి స్పందన రావడం లేదని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆటో కార్మికుల కుటుంబాలను ఆగం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆటో కార్మికుల ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఎండీ సయ్యద్, రవి, శ్రీను, జగదీశ్, శివ, దర్శన్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం ఎంపీ బరిలో సీపీఐ?

- కాంగ్రెస్ అభిష్టానం ముందు ప్రతిపాదన
- సీపీఎం నాయకత్వంలో ఇంకా రాని స్పష్టత

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేసే యోచనలో సీపీఐ ఉన్నట్టు తెలిసింది. ఈ మేరకు ఇటీవలే తెలంగాణ, ఏపీలో ఒక్కో స్థానం నుంచి పోటీ చేయాలని రాష్ట్ర సమితి సమావేశంలో ఆ పార్టీ నిర్ణయించింది. ఈ ప్రతిపాదనను ఏఐసీసీ ముందు పెట్టి, ఖమ్మం సీటుపై కాంగ్రెస్ పార్టీని ఒప్పించాలనే యోచనలో సీపీఐ రాష్ట్ర నాయకత్వం ఉన్నది. ఖమ్మం సీటును కాంగ్రెస్ వదులుకునే అవకాశం ఉండదని, కచ్చితంగా ఆ స్థానం నుంచి ఆ పార్టీ అభ్యర్థే పోటీ చేస్తారని కాంగ్రెస్ వర్గాలు ఇప్పటికే తేల్చి చెప్పాయి. అసెంబ్లీ ఎన్నికల్లో చివరి నిమిషం వరకు కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవాలని భావించిన సీపీఎం అనూహ్య పరిణామాలతో 19 స్థానాల్లో ఒంటరిగానే బరిలోకి దిగింది. ఒక్క స్థానంలో కూడా డిపాజిట్ దక్కించుకోలేకపోయింది. ఈ దశలో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో సీపీఎం పోటీ చేస్తుందా? లేక మరో పార్టీకి మద్దతిస్తుందా అన్న చర్చ జరుగుతున్నది. బీజేపీకి వ్యతిరేకంగా గెలిచేవారికి మద్దతిస్తామని ఇప్పటికే ప్రకటించిన ఆ పార్టీ తెలంగాణలో మాత్రం ఎవరికి మద్దతిస్తుందనేది చర్చనీయాంశంగా మారింది.

నేడు హైదరాబాద్‌కు ఉపరాష్ట్రపతి రాక

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ బుధవారం హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. గగన్ మహల్‌లోని ఏవీ కాలేజీలో జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ నిర్వహించే కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. సాయంత్రం 5.15 గంటల నుంచి కళాశాలలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉపరాష్ట్రపతితోపాటు ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, ఫౌండేషన్ చైర్మన్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొననున్నారు.

మాజీ ప్రియుడిపై గంజాయి కుట్ర

- ఇరికిద్దామని.. ఇరుక్కుపోయిన యువతి
- స్నేహితులకు డబ్బులిచ్చి గంజాయి తెచ్చి
- సినీఫక్కీలో బాధితుడి కారులో ప్యాకెట్లు
- 100కు ఫోన్.. దర్యాప్తులో నిజాలు వెల్లడి
- యువతితోపాటు మరో ఆరుగురి అరెస్టు

పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

బంజారాహిల్స్, డిసెంబర్ 26: మాజీ ప్రియుడిని డ్రగ్స్ కేసులో ఇరికించి పగ తీర్చుకోవాలని స్కెచ్‌వేసి అతడి కారులో గంజాయి పెట్టి పోలీసులకు పట్టించిన యువతి ప్లాన్ బెడిసి కొట్టి కటకటాలపాలైంది. సినీఫక్కీలో జరిగిన ఈ ఘటనను జూబ్లీహిల్స్ పోలీసులు ఛేదించారు. పోలీసుల వివరాల ప్రకారం.. నరూర్‌నగర్‌కు చెందిన కాశగోని శ్రవణ్‌కుమార్ (30) అమీర్‌పేటలోని ప్రైవేటు బ్యాంకులో లోన్స్ విభాగంలో పని చేస్తుంటాడు. రహ్మత్‌నగర్‌కు చెందిన విశ్రాంత ఏఎస్ఐ కుమార్తె అదోక్షజ అలియాస్ రింకీ అలియాస్ రీనా (28) మూడేండ్ల క్రితం శ్రవణ్‌తోపాటు పనిచేసే క్రమంలో ప్రేమలో పడింది. ఇద్దరూ రెండున్న రేండ్లు ప్రేమించుకున్నారు. ప్రస్తుతం ఎల్ఎల్‌బీ ఫైనల్ ఇయర్ చదువుతున్న రింకీ శ్రవణ్‌కుమార్‌కు మధ్య ఇటీవల విభేదాలు తలెత్తాయి. తన గురించి స్నేహితులతో చెడుగా చెప్తూ పరువు తీస్తున్నాడని, శ్రవణ్‌పై రింకీ కక్ష పెంచుకుంది. స్నేహితులతో కలిసి శ్రవణ్ గంజాయి కేసులో ఇరికించాలని ప్లాన్ చేసింది. రింకీ తన బాయ్‌ఫ్రెండ్ దీపక్ మోహన్‌తో కలిసి యశ్వంత్ సాయి (21) అనే స్నేహితుడికి డబ్బులు పంపించి 8 గంజాయి ప్యాకెట్లు తెప్పించారు. రహ్మత్‌నగర్‌కు చెందిన కామన్ ఫ్రెండ్‌తో ఫోన్ చేయించి శ్రవణ్‌ను కృష్ణకాంత్ పార్క్ వద్దకు పిలిపించారు. తన ఫ్రెండ్ కారు తీసుకొచ్చిన శ్రవణ్‌ను జూబ్లీహిల్స్‌లోని అమ్నేషియా పబ్‌కు వెళ్లి అక్కడ మాట్లాడుకుందామని కామన్ ఫ్రెండ్ స్నేహితులు నమ్మబలికారు. శ్రవణ్ కారులోనే అతడితోపాటు దీక్షిత్‌రెడ్డి, ప్రణీత్ గోపి (20), సూర్య తేజ (22) ఎక్కారు. పబ్‌కు వచ్చిన వారందరూ 20 నిమిషాలపాటు బీర్లు తాగారు. రింకీ కాసేపటి తర్వాత వాష్‌రూమ్ వెళ్తున్నానని చెప్పి పబ్ నుంచి కిందకు వచ్చేసింది. పబ్ వద్ద పార్క్‌చేసిన శ్రవణ్ కుమార్ అనే వ్యక్తికి చెందిన కారులో డ్రగ్స్ ఉన్నాయంటూ పోలీసులకు ఫోన్ చేసింది. పోలీసులు అక్కడకు చేరుకొని శ్రవణ్ పిలిపించి అతడి సమక్షంలో తనిఖీలు చేయగా కారు సీట్ల కింద పెట్టిన 8 గంజాయి ప్యాకెట్లు లభించాయి. షాక్‌కు గురైన శ్రవణ్ తనకేమీ తెలియదని, తనతోపాటు కారులో వచ్చిన వ్యక్తులు గంజాయి ప్యాకెట్లు పెట్టి ఉంటారని చెప్పాడు. వారికోసం వెతకగా అప్పటికే పబ్ నుంచి వెళ్లిపోయినట్టు తెలిసింది. శ్రవణ్‌ను పోలీసులు పీఎస్‌కు తరలించి ప్రశ్నించగా, పబ్‌కు రావడానికి దారితీసిన పరిస్థితులు, మాజీ ప్రియురాలితో చర్చల కోసం తనకు వచ్చిన ఫోన్‌కాల్స్, తన తోపాటు వచ్చిన